సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం । 12 । జూలై । 2023



విద్యార్థులకు అభినందన

సిరిసిల్లఅర్బన్: 1వ జూనియర్, సబ్ జూనియర్ అంతర్‌జిల్లా ఉషు చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు, రజత పతకాలు సాధించిన విద్యార్థులను ఏఎస్పీ చంద్రయ్య అభినందించారు.



సమ్మెలో 'మధ్యాహ్న' కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె బాటపట్టి రెండురోజులుగా వంట తయారీ బంద్ చేశారు. బిల్లులు చెల్లించి, గౌరవ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలి వేగంగా వీస్తుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అధిక జనాభా అభివృద్ధికి అవరోధం



సిరిసిల్లటౌన్: అధిక జనాభా దేశాభివృద్ధికి అవరోధమని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాములు అన్నారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలను వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా ఆయన మాట్లాడారు. కుటుంబ నియంత్రణ పాటిస్తే జరిగే లాభాలను వివరించారు. మగవారి వేసెక్టమీ ఆపరేషన్‌తో ఎటువంటి హానీ ఉండదన్నారు. చిన్న కుటుంబమే మెరుగైన జీవితానికి సోపానమని, కనే బాధ్యత మహిళలదే అయినా కుటుంబ నియంత్రణలో కీలకపాత్ర పురుషులదే కావాలన్నారు. అంబేద్కర్‌నగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణవేణి, శ్రీనివాస్, కాశీనాథం, సురేష్, లింగం, జలపతి పాల్గొన్నారు.

హాస్టళ్లలో వంద శాతం విద్యార్థులను చేర్పించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో వంద శాతం విద్యార్థులను చేర్పించాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వసతి గృహాల వార్డెన్లు, ఆయా శాఖల జిల్లా అధికారులతో మంగళవారం సమీక్షించారు. 2023–24 విద్యాసంవత్సరంలో వసతి గృహాల్లో విద్యార్థులు పూర్తి స్థాయిలో చేరేలా చూడాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, మెనూను వివరిస్తూ విద్యార్థులకు సీట్లు కేటాయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో ఆయా కులాలకు కేటాయించిన సీట్లలో రిజర్వేషన్ ప్రకారం ఇవ్వాలని, ఒక్క అదనపు సీటు కావాలన్నా కలెక్టర్ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, బీసీ అభివృద్ధి అధికారి ఎస్.రాఘవేందర్, సహాయ జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి టి.సంపూర్ణ పాల్గొన్నారు.

'ఆక్వా హబ్'కు అన్ని వసతులు

సిరిసిల్ల: జిల్లాలోని చీర్లవంచ శివారుల్లో మధ్యమానేరు బ్యాక్ వాటర్‌లో ఏర్పాటయ్యే ఆక్వా హబ్ (చేపల పెంపకం)కు అన్ని వసతులు కల్పిస్తామని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ అన్నారు. ఫిష్ ఇన్ ఇండియా, టిల్లార్, రాజన్న ఆక్వా ప్రతినిధులు అదనపు కలెక్టర్‌ను కలిసి పెండింగ్ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, విద్యుత్ సౌకర్యం, ఇతర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో శ్రీనివాస్‌రావు, తంగళ్లపల్లి తహసీల్దార్ పి.సదానందం, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

పత్తి పంటకు యూరియా వాడకం తగ్గించాలి



ఇల్లంతకుంట(మానకొండూర్): పత్తి పంటకు యూరియా మోతాదు తగ్గించి వాడాలని జిల్లా వ్యవసాయాధికారి వడ్డేపల్లి భాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని రేపాక గ్రామంలో వరి, పత్తి, ఆయిల్‌పాం, ఖర్జూర పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, నత్రజని ఎరువులను ఎంత తగ్గిస్తే పంటల్లో అంత ఆశించిన దిగుబడులు వస్తాయని దీంతో పాటు చీడపీడల బెడద ఉండబోదన్నారు. శాఖీయ దశలో ఆశించే రసం పీల్చే పురుగులు తెల్ల దోమ, పచ్చ దోమ నివారణ చర్యలపై రైతులకు వివరించారు. పంట మార్పిడిలో భాగంగా రైతులు ఆయిల్‌పాం పంటను సాగు చేయాలన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏఓ, ఏఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సురేష్, ఏఈఓ రవళి ఉన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ

సిరిసిల్లఎడ్యుకేషన్: రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభచాటారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల పాఠశాలకు చెందిన ఎస్.ఐశ్వర్య, ఆర్.అభిషేక్ ద్వితీయ బహుమతి సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో డీఈఓ రమేశ్, హెచ్‌ఎం రవీందర్, ఎస్‌ఎస్‌ఏ కోఆర్డినేటర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.



ఇది జిల్లాలోని కోనరావుపేట మండలం నిమ్మపల్లి శివారులో ఫారెస్ట్ అధికారులు నాటిన ప్లాంటేషన్. పోడు భూముల పట్టాల పంపిణీలో తమకు పట్టాలు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిమ్మపల్లి శివారులోని గిరిజన తండాలకు చెందినవారు ఆ ప్లాంటేషన్‌లోని మొక్కలను నరికివేశారు. ఫారెస్ట్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు మొక్కలను నరికేసినవారికి కౌన్సెలింగ్ నిర్వహించి ఫారెస్ట్ భూముల జోలికి వెళ్లవద్దని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై రమాకాంత్ స్పష్టం చేశారు.



ఈఫొటోలో ఉన్నది చందుర్తి మండలం సనుగుల శివారులోని అటవీ భూమి. ఏడాది క్రితం అటవీ భూమిలోని చెట్లను నరికి ఆ భూమిని ఇటీవల దున్నేశారు. కొత్తగా మైదానంగా సాగుకు యోగ్యంగా ఉన్న అటవీ భూముల్లోకి వెళ్లి చెట్లను తొలగిస్తున్నారు. పోడు భూములకు పట్టాలు ఎప్పటికైనా వస్తాయనే నమ్మకంతో కొత్తగా అడవిని కబ్జా చేస్తున్నారు. ఏదో రకమైన పంటలను ఆ భూమిలో వేసి తమ ఆధీనంలో ఆ భూమి ఉన్నట్లుగా స్పష్టం చేస్తున్నారు.

ఇలా జిల్లాలో పోడు భూముల పంచాయితీ ముగింపు లేకుండా ముందుకు సాగుతుంది.

పోడు.. గోడు

- జిల్లాలో ఒడవని 'పంచాయితీ'
- సాంకేతికతతో 'పోడు' గుర్తింపు
- పట్టాల కోసం వెల్లువెత్తుతున్న దరఖాస్తులు
- 1,614 కుటుంబాలకు 2,858.34 ఎకరాల పంపిణీ
- అయినా.. అదే గొడవ

జిల్లాలో అటవీ హక్కుల దరఖాస్తుల స్వరూపం

అటవీ ప్రాంత గ్రామాలు 67	అటవీ విస్తీర్ణం 96,394 ఎకరాలు
అటవీ హక్కుల కోసం వచ్చిన దరఖాస్తులు 5,939	
అటవీ భూములు 14,031.23 ఎకరాలు	
దరఖాస్తు చేసిన గిరిజనులు 2,842	
గిరిజనులు దరఖాస్తు చేసుకున్న భూములు 7,785.31 ఎకరాలు	
గిరిజనేతరుల దరఖాస్తులు 3,097	
గిరిజనేతరులు దరఖాస్తు చేసుకున్న ఎకరాలు 6,245.32 ఎకరాలు	
ఇటీవల పంపిణీ చేసిన పట్టాలు 1,615	
పంపిణీ చేసిన భూమి 2,858.34 ఎకరాలు	



నిమ్మపల్లి గిరిజన మహిళలతో మాట్లాడుతున్న పోలీసులు(ఫైల్)

సిరిసిల్ల: పోడు భూములకు పట్టాలు ఇవ్వడానికి 2005 డిసెంబరు 13 నాటికి అటవీ భూములను సాగు చేసుకున్నవారు మాత్రమే అర్హులు. ఇలా జిల్లావ్యాప్తంగా 1,614 కుటుంబాలకు 2,858.34 ఎకరాలు ఇటీవల మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ సిరిసిల్లలో అందించారు. కానీ గత ఐదారేళ్లుగా అటవీ భూముల్లో చెట్లు, మొట్లను తొలగించినవారు సైతం తమ భూములకు పట్టాలివ్వాలని కోరుతున్నారు. ఇలాంటి కొత్త పోడు భూములను గుర్తించేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంది. జిల్లాలో వచ్చిన మొత్తం దరఖాస్తులను క్షేత్రస్థాయిలో భూ సర్వేయర్‌తో పాటు, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. వాటిని అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా జియో ట్యాగింగ్ చేశారు. ఇలా తీసుకున్న చిత్రాలను కార్టోశాట్ (ఉపగ్రహ) మ్యాప్ పరిశీలించి, భూమి హద్దులు నిర్ణయించారు. 2005 డిసెంబరు కంటే ముందు నాటి మ్యాప్‌లతో పోల్చి చూశారు. ఇలా సాంకేతిక సాయంతో శాస్త్రీయంగా విశ్లేషించి పాత పోడు భూములకు పట్టాలు ఇచ్చారు. కానీ ఇదేం పట్టించుకోకుండా, ఐదారేళ్ల కిందట సాగు చేసిన వారు, పదేళ్ల కిందట సాగు చేసినవారు తమకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

భూమి బంగారమైంది

భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. భూగర్భ జలాలు పెరగడంతో అన్ని ప్రాంతాల్లోనూ వ్యవసాయం సాగుతుంది. మరోవైపు పట్టా భూములకు రైతుబంధు రావడం, ఉచిత కరెంట్ వంటి ప్రభుత్వ పథకాలతో భూమిపై క్రేజీ పెరిగింది. ఒక్క ఎకరం భూమిని సాధించినా కనీసం రూ.20 లక్షలు సంపాదించినట్లే అనే భావన పెరిగింది. దీంతో అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని అటవీ గ్రామాల్లో డిమాండ్ వస్తుంది. నిజానికి అసలే భూముల లేని పేదలకు అర్హతను బట్టి ఇవ్వాల్సి ఉండగా, ఇందులో రాజకీయ జోక్యం ఎంట్రీకావడంతో పోడు పట్టాల్లోనూ ఉన్నోళ్లకు మరింత భూమి రాగా, అసలే భూమి లేని కూలీలకు నిబంధనలు అడ్డు రావడంతో ఆయా ప్రాంతాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలోనూ ఇవే దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నాయి.

గుంట భూమి కూడా లేదు



నాకు గుంట భూమి కూడా లేదు. కూలీ పని చేస్తాను. 2005 కంటే ముందే కొంత భూమిలో ఎవుసం చేసుకున్న. కానీ ఫారెస్ట్ అధికారులు వచ్చి ఆ భూమిలో ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. దీంతో నాకు పోడుభూమి పట్టా రాలేదు. నాకు ముగ్గరు ఆడపిల్లలు, ఒక్క అబ్బాయి. నాకు భూమి ఇయ్యాలి.

– బిక్యానాయక్, నిమ్మపల్లి

పట్టా రాలేదు



మాది గంభీరావుపేట మండలం దమ్మన్నపేట. మూడెకరాల భూమి ఉంది. కానీ పోడు భూముల పట్టా రాలేదు. ఇద్దరు కొడుకులున్నారు. ఎక్కడా ఇంకా మాకు భూమి లేదు. కూలీ పని చేసుకుని బతకాలే. అందరికీ ఇచ్చిండ్రు మాకు ఇయ్యలేదు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు అన్నీ సార్లకు ఇచ్చిన.

– ఆజ్మీరా రేణ, దమ్మన్నపేట

వచ్చినవారే మళ్లీ వస్తున్నారు



ప్రజావాణికి వచ్చినవారే మళ్లీ మళ్లీ వచ్చి దరఖాస్తులు ఇస్తున్నారు. రెండు చోట్ల పోడు భూములున్నవారు ఒక్క చోటే వచ్చిందని, మాకు ఇంకా ఎక్కువ భూమి ఉందని, మొత్తం పట్టాలో రాలేదని దరఖాస్తు చేస్తున్నారు. రెండు చోట్ల భూమి ఉన్నట్లు నమోదు చేస్తే సాఫ్ట్‌వేర్ తీసుకోవడం లేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు పట్టాలు పంపిణీ చేశాం.

– బి.గౌతమ్‌రెడ్డి, జెడ్పీ సీఈవో

అనుకోకుండా కలిసిన జనశక్తి నేత రాజన్న.. ఎమ్మెల్యే రసమయి

- పరామర్శకు వెళ్లి తారసపడిన నేతలు



మల్లారెడ్డి ఇంట్లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కూర రాజన్న (సర్కిల్‌లో)

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో సీపీఐ (ఎంఎల్) జనశక్తి అగ్రనేత కూర రాజన్న అలియాస్ రాజేందర్.. తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంగళవారం అనుకోకుండా కలుసుకున్నారు. పెద్దలింగాపూర్‌లో అనారోగ్యంతో ఉన్న మాజీ ఎంపీటీసీ గొల్ల మల్లారెడ్డి అలియాస్ గుర్రాల మల్లారెడ్డిని పరామర్శించేందుకు ఎమ్మెల్యే బాలకిషన్ ఆయన ఇంటికి వెళ్లారు. అప్పటికే మల్లారెడ్డిని పరామర్శించేందుకు జనశక్తి అగ్రనేత కూర రాజన్న వచ్చి ఉన్నారు. అక్కడ ఎమ్మెల్యే, రాజన్న తారసపడ్డారు. ఆత్మీయంగా పలకరించుకున్న ఆ ఇద్దరు నేతలు.. ఐదు నిమిషాల పాటు ఓ గదిలోకి వెళ్లి మాట్లాడుకున్నారు. కూర రాజన్న, రసమయి అనూహ్యంగా ఇలా కలుసుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

మరుగుదొడ్లు వినియోగిస్తున్నారా



స్వచ్ఛ సర్వేక్షణ్ పనులు పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

ముస్తాబాద్(సిరిసిల్ల): మరుగుదొడ్లు వినియోగిస్తున్నారా.. మురుగు కాల్వలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మండలంలోని మోహినికుంట, రామలక్ష్మణపల్లె, నామాపూర్ గ్రామాల్లో మంగళవారం రాష్ట్ర బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈసందర్భంగా కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, మురుగు కాల్వల వ్యవస్థను అధికారులు పరిశీలించారు. నూరుశాతం వీటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వచ్చే నెలలో కేంద్ర బృందం ఈ అంశాలను పరిశీలిచేందుకు వస్తుందని పేర్కొన్నారు. ఎంపీడీఓ రమాదేవి, ఎంపీవో ఆరిఫ్, సర్పంచ్‌లు వనజ, విజయ, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

నేతన్నలకు ఇంకేం చేద్దాం

- చేనేత, జౌళిశాఖ అధికారులతో మంత్రి కేటీఆర్
- హైదరాబాద్‌లో సమీక్ష



మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: రాష్ట్రంలోని చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఇంకేం చేస్తే మరింత లబ్ధి కలుగుతుందో చెప్పాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు కోరారు. హైదరాబాద్‌లో చేనేత, జౌళిశాఖ ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షించారు. రాష్ట్రంలోని చేనేత కార్మికుల కోసం, పవర్ కార్మికుల సంక్షేమం, ఉపాధి కోసం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలకు తోడుగా ఇంకా ఏమైనా చేయవచ్చా, ఇప్పుడు అందిస్తున్న చేయూతను మరింత సరళతరం చేయడం వంటి అంశాలపై మంత్రి సమీక్షించారు. ఇంకా చేయవచ్చునో స్పష్టమైన నివేదికను వారం రోజుల్లో సమర్పించాలని మంత్రి కోరారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మరిన్ని పథకాలను ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో మంత్రి అధికారులతో సమీక్షించారు. సమావేశంలో చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ బుద్ధాప్రకాశ్ జ్యోతి, జాయింట్ డైరెక్టర్లు వెంకటేశం, ఇందుమతి, తస్నీమా, టెస్కో జీఎం యాదగిరి, ఆర్‌డీడీ అశోక్‌రావు, జౌళిశాఖ అధికారులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు నెలనెలా పరీక్షలు



కొదురుపాక హైస్కూల్ విద్యార్థులతో డీఈఓ

బోయినపల్లి(చొప్పదండి): జిల్లాలో పదోతరగతి విద్యార్థులకు ప్రతి నెలా పరీక్ష నిర్వహించి ర్యాంకులు తెలియ చేస్తామని డీఈఓ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. కంప్యూటర్ ఛాంప్ కింద ఎంపికైన మండలంలోని కొదురుపాక హైస్కూల్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో కంప్యూటర్ లిట్రసీ విద్య పెంపొందించడానికి కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలోని 64 పాఠశాలల్లో కంప్యూటర్ ఛాంప్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అనంతరం మోడల్‌స్కూల్ తనిఖీ చేసి ప్రత్యేక పీరియడ్లు ఎందుకు నిర్వహించడం లేదని ప్రిన్సిపాల్‌ను అడిగారు. అనంతరం కస్తూరిబా పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం ఉండాలని ఆదేశించారు. డీఈఓ వెంట ఎంఈఓ శ్రీనివాసదీక్షిత్ తదితరులున్నారు.

జిల్లాను 'ముసురు'కున్న వర్షం



సిరిసిల్ల: జిల్లాను ముసురు వర్షం కమ్ముకుంది. మంగళవారం వేకువజామునుంచే తుంపర వాన కురిసింది. జిల్లా అంతటా ఇదే విధంగా చినుకులు రాలాయి. వర్షాకాలంలో పెద్ద వానల కోసం రైతులు నిరీక్షిస్తుంటే, తుంపర తప్ప పెద్ద వర్షం లేదు. జిల్లాలోని రుద్రంగిలో అత్యధికంగా 28.2 మిల్లీ మీటర్ల వర్షం నమోదు కాగా, ముస్తాబాద్‌లో అత్యల్పంగా 5.3 మి.మీ వర్షం పడింది. చందుర్తిలో 25.6, వేములవాడ రూరల్ 12.0, బోయినపల్లి 14.4, వేములవాడ 13.8, సిరిసిల్ల 11.3, కోనరావుపేట 9.2, వీర్నపల్లి 5.4, ఎల్లారెడ్డిపేట 13.6, గంభీరావుపేట 7.3, తంగళ్లపల్లి 9.0, ఇల్లంతకుంటలో 8.1 మి.మీ వర్షం పడింది. విడవకుండా పడిన చినుకులతో ఉదయం పూట జనజీవనానికి ఇబ్బంది ఏర్పడింది. పగటి పూట కాస్త గెరువు కాగా, సాయంత్రం కూడా చిన్నగా చినుకులు రాలుతున్నా పెద్ద ప్రభావం లేదు. బుధవారం కూడా భారీ వర్షాలు ఉన్నాయనే వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లా ప్రజలు వర్షాలపై ఆశలు పెట్టుకున్నారు.

ప్రసూతి సేవలు మరింత పారదర్శకం



జిల్లా ఆసుపత్రిలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లటౌన్: జిల్లా ఆసుపత్రిలో ప్రసూతి సేవలు మరింత పారదర్శకంగా అందిస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. మంగళవారం సిరిసిల్ల జిల్లాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రిలో మాదిరిగా జిల్లాసుపత్రిలో మెటర్నిటీ ఎగ్జిక్యూటివ్ సర్వీస్(ఎంఈఎస్) ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వీరు ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు ఓపీ, ఐపీ, చికిత్సతో పాటు ప్రసూతి సేవలు అందించడానికి ప్రత్యేకంగా విధులు నిర్వహిస్తారని వివరించారు. పైలట్ ప్రాజెక్టుగా జిల్లాసుపత్రిలో ఈసేవలు వినియోగంలోకి వచ్చాయని వెల్లడించారు. వైద్యులు సైతం పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పీఆర్ వ్యవస్థ ప్రభావంతంగా అమలయ్యేందుకు డాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఎంఈఎస్‌లు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తారని, వీరిని సులభంగా గుర్తించేందుకు ప్రత్యేక డ్రెస్‌కోడ్ ఉంటుందన్నారు.

ఆత్మీయతతో వైద్య సేవలు అందించాలి

వేములవాడఅర్బన్: ప్రభుత్వాసుపత్రికి వచ్చే గర్భిణులకు ఆత్మీయతతో కూడిన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిని మంగళవారం ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. గర్భిణులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేగంగా సేవలు అందించేలా చూడాలన్నారు. ఇందుకు ప్రత్యేకంగా నియమించిన మెటర్నిటీ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. వీరికి సహాయకులుగా బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆస్పత్రి పనితీరును పరిశీలించారు. కార్యక్రమాల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రావు, వేములవాడ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్, మెటర్నిటీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మహేష్, ఆర్‌ఎంఓ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమయం	: సోమవారం రాత్రి 11.40 గంటలు.
స్థలం	: సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్, సిద్ధార్థనగర్, విద్యానగర్, పోచమ్మ వీధి, అంబేద్కర్‌నగర్ ప్రాంతాలు.
సందర్భం	: విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.
కారణం	: చంద్రంపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫోర్త్ ఫీడర్ బ్రేక్ డౌన్.
ప్రత్యేకత	: సిరిసిల్లలోని చాలా ప్రాంతాల్లో చీకటి కమ్ముకుంది. తుంపర వర్షం పడుతుంది.
ఫిర్యాదులు	: సిరిసిల్ల 'సెస్' ఆఫీస్‌లోని సెక్యూరిటీ సెల్ ఫోన్‌కు కరెంట్ ఎప్పుడు వస్తుందని ఒక్కటే ఫోన్లు. 'సెస్' వాట్సప్ గ్రూప్‌లో కరెంట్ లేదనే మెస్సేజ్‌లు.

అర్ధరాత్రి ఆ గంట..!

- చీకట్లో 'వెలుగు' వేట
- చినుకు పడి కరెంట్ కట్
- అర్ధరాత్రి ప్రజలకు కష్టాలు
- బ్రేక్‌డౌన్ గుర్తించి మరమ్మతు



స్తంభంపైకి ఎక్కుతున్న అసిస్టెంట్ హెల్పర్ అనిల్



ఇన్సులేటర్ తొలగిస్తూ..

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో 'సెస్' అసిస్టెంట్ హెల్పర్లు విద్యుత్ సరఫరాలో అంతరాయానికి కారణాన్ని తెలుసుకునే పనిలో పడ్డారు. విద్యుత్ స్తంభాలను టార్చ్‌లైట్‌తో చూస్తూ.. వైర్లు సరిగా ఉన్నాయా లేదా అని చెక్ చేశారు. అలా ఓ 20 నిమిషాల్లో విద్యానగర్ అపార్టుమెంట్ సమీపంలో స్తంభంపై ఇన్సులేటర్ కాలిపోయినట్లు గుర్తించారు. వెంటనే 'సెస్' ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సబ్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చి లైన్ క్లియర్ (ఎల్‌సీ) తీసుకున్నారు.

వర్షంలో.. చీకట్లో.. స్తంభంపైకి..

ఓ వైపు వర్షం.. మరో వైపు చిమ్మని చీకటి.. టార్చ్‌లైట్ వెలుతుర్లో అసిస్టెంట్ హెల్పర్ అనిల్ ఇన్సులేటర్ కాలిపోయిన స్తంభంపైకి ఎక్కాడు. కాలిపోయిన ఇన్సులేటర్ తొలగించి కొత్తది వేసి విద్యుత్ లైన్ సిద్ధం చేశాడు. ఇదంతా చేసేందుకు 25 నిమిషాలు పట్టింది. ఈ లోగా కరెంట్ ఎప్పుడు వస్తుందని ఒక్కటే ఫోన్లు.. వర్క్ జరుగుతుంది.. అరగంటలో వస్తదని సమాధానం చెబుతున్నా అదే విధంగా ఫోన్ల మోత. నిజానికి ఎవరికి వారు కరెంట్ లేదని చెప్పే ప్రయత్నం చేస్తే.. మరికొందరు 'సెస్'సిబ్బందిని నిందిస్తూ.. రోజూ ఇదేం బ్రేక్ డౌన్.. పొద్దంతా చెక్ చేసుకోవద్దా అంటూ కోపాన్ని ప్రదర్శించారు. నిజానికి వర్షం కారణంగా చిలుము వచ్చి ఇన్సులేటర్ కాలిపోయింది. దీంతో సబ్‌స్టేషన్‌లో బ్రేక్ డౌన్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏదీ ఏమైనా ఓ గంట కరెంట్ లేకుంటే.. చీకట్లో సమస్యను గుర్తించి, సరి చేసి విద్యుత్ సరఫరా చేయడం విశేషం. 'సెస్' క్షేత్రస్థాయి సిబ్బంది చీకట్లో ఊరందరికీ వెలుగులను పంచేందుకు పడిన కష్టాన్ని చూస్తే శభాష్ 'సెస్' అనిపించక మానదు.

నిత్యం నలుగురు సిబ్బంది..



రోజూ సిరిసిల్లలో నలుగురు 'సెస్' సిబ్బంది సిద్ధంగా ఉంటారు. టౌన్–1, 2లో ఇద్దరిద్దరు చొప్పున ఉంటాం. ఎప్పుడు సమస్య వచ్చినా వెంటనే ఉన్నత అధికారుల ఆదేశం మేరకు క్షేత్రస్థాయిలో సమస్యను గుర్తించి రిపేరు చేయాల్సి ఉంటుంది. మాకు మూడు రోజులకోసారి నైట్ డ్యూటీ వస్తుంది.

– అనిల్, శోభన్, అసిస్టెంట్ హెల్పర్లు

క్లుప్తంగా

కలెక్టరేట్‌లో వీధి కుక్క హల్‌చల్



సిరిసిల్లటౌన్‌: నిత్యం వందలాది సంఖ్యలో వచ్చిపోయే సందర్శకులతో సందడిగా ఉండే సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంగళవారం వీధికుక్క హల్‌చల్‌ చేసింది. మూడంతస్తుల భవంతిలోకి అన్ని ఫ్లోర్లు తిరుగుతూ అక్కడున్నవారిని భయభ్రాంతులకు గురిచేసింది. అసలే వీధికుక్కల కాట్లు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోకి చొచ్చుకు రావడం విమర్శలకు తావిచ్చింది. వివిధ కారణాలతో వచ్చే సామాన్యులను లోపలికి పంపించడంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించే సిబ్బంది కళ్లుగప్పి శునకం భవంతిలోకి రావడం విశేషం. కాగా ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోకి వీధికుక్క వచ్చి సందర్శకులను భయపెట్టడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్‌ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు రాచర్లగొల్లపల్లి మూడుగుడుల వద్ద మంగళవారం రాత్రి పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్‌ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్‌ మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ప్రేమ్‌దీప్‌ తెలిపిన వివరాలు.. మానేరువాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో అటుగా ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్లను ఆపి అనుమతి పత్రాల కోసం విచారించగా ఎలాంటి అనుమతులు లేవని తెలియడంతో ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి సీజ్‌ చేశారు. ట్రాక్టర్‌ యజమానులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆరోగ్య మహిళ'

సిరిసిల్లటౌన్‌: రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్‌ సుమన్‌ మోహన్‌రావు ప్రకటనలో తెలిపారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్‌, వేములవాడ పీఏసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన శిబిరాల్లో ఓపీడీ 401, బ్రెస్ట్‌ 398, ఓరల్‌ కావిటీ 398 పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ6, ల్యాబ్‌ 60, థైరాయిడ్‌ 34, విటమిన్‌ డీ 45, సీబీపీ 44, సూక్ష్మ పోషకాలు 66 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో ఐదుగురిని జిల్లాసుపత్రికి రెఫర్‌ చేసినట్లు వివరించారు.

దళారులను ఆశ్రయించవద్దు

సిరిసిల్ల కల్చరల్‌: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టులు భర్తీ చేసే ప్రక్రియ పూర్తిగా ప్రతిభ ఆధారితంగా జరుగుతుందని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 58 ఖాళీలకు 836 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. అర్హుల జాబితా విషయంలో అభ్యంతరాలు, మార్పులు ఉన్న పక్షంలో తగిన ఆధారాలతో ఈ నెల 15న మధ్యాహ్నం 2 గంటలలోపు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సమ్మెలో 'మధ్యాహ్న' కార్మికులు



ఇక్కడ మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నది జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్‌ పాఠశాల ఉపాధ్యాయులు. మధ్యాహ్న భోజన కార్మికులు తమ డిమాండ్ల సాధనకు సమ్మెకు వెళ్లడంతో విద్యార్థులకు భోజనం అందించే విషయంలో అంతరాయం రాకుండా ఉపాధ్యాయులే వంట చేస్తున్నారు. దాదాపు 500 మందికిపైగా విద్యార్థులకు వంట చేయడం కష్టంగా ఉందని వెంటనే కార్మికులు పనిలోకి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.



ఇక్కడ భోజనం చేస్తున్నది జిల్లా కేంద్రంలోని గీతానగర్‌ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు. పాఠశాలలో దాదాపు వెయ్యి మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ మధ్యాహ్న భోజనం తయారు చేయాలంటే వంటలో ప్రావీణ్యం ఉన్నవారే కావాలి. వెయ్యి మందికి భోజనం సర్దుబాటు చేయడం తమతో కాదని, ఇంటి నుంచి లంచ్‌ తెచ్చుకోవాలని యాజమాన్యం తెలుపడంతో ఇలా విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తిన్నారు.

- ఆరునెలలుగా బిల్లుల పెండింగ్‌
- ఖరారు కాని సరుకుల సరఫరా టెండర్స్‌
- భోజన సర్దుబాటులో టీచర్లు

సిరిసిల్లఎడ్యుకేషన్‌: జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెకు వెళ్తున్నట్లు అధికారులకు విన్నవించి రెండురోజులుగా వంట తయారీ బంద్‌ చేశారు. తమకు రావాల్సిన బిల్లులు చెల్లించాలని, ప్రభుత్వం అందిస్తామన్న గౌరవ వేతనం అమలు చేయాలని డిమాండ్‌ చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం తయారీకి ప్రభుత్వం ఇస్తున్న నిధులు, ప్రస్తుతం భోజన తయారీ రేట్లకు అసలు ధరల్లో పొంతన లేదని వాపోతున్నారు. వంట చేయడానికి కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల సాధనకు తప్పని పరిస్థితిలో సమ్మెకు దిగినట్లు కార్మికులు తెలిపారు.

సర్దుబాటుతో భోజనాలు

ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు అనేక మంది కనీసం ఒక పూట మంచి ఆహారం దొరుకుతుందని వచ్చేవారు లేకపోలేదు. అలాంటి వారికి కార్మికుల సమ్మె ఇబ్బంది కలిగిస్తుంది. మధ్యాహ్న భోజనం అందించడం మానేస్తామన్న మాటతో ప్రతీ తరగతిలో హాజరుశాతం పడిపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే విద్యార్థులకు వండిపెట్టారు.

జిల్లాలో..

మధ్యాహ్న భోజనం అందుతున్న పాఠశాలలు	478
విద్యార్థులు	41,328
ఏజెన్సీలు	478
కార్మికులు	863
కిచెన్‌ షెడ్లు ఉన్న పాఠశాలలు	353
నిర్మాణంలో ఉన్నవి	27
ఇంకా కావాల్సినవి	98

ఆలోచన బారెడు.. ఆచరణ చారెడు

ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేటుకు దీటుగా నిర్వహిస్తాం, విద్యార్థులు పౌష్టికాహారం అందిస్తామన్న పాలకులు, అధికారుల మాటలు బారెడుగా ఆచరణ చారెడుగా ఉందని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణకు ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థి ఒకరికి ప్రభుత్వం రూ.5.45, ఆరు నుంచి నుంచి 8వ తరగతి వరకు రూ.8.17, తొమ్మిది నుంచి 10వ తరగతి వరకు రూ.10.67 చెల్లిస్తున్నారు. కాగా నెలల తరబడి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కార్మికులను అప్పుల ఊబిలోకి నెట్టుతున్నట్లు ఆరోపిస్తున్నారు.

పిల్లలు ఆకలితో ఉండొద్దని



ఇన్నాళ్లు పిల్లలకు అన్నం వండినం. ఇప్పుడు సమ్మెకు వెళ్తే పిల్లలు ఒక పూట ఆకలితో ఉంటే మాకు మంచికాదని వంటకు కొందరం వచ్చినం, కొందరం సమ్మెకు వెళ్లినం. మేము అడిగేది లక్షల జీతాలు కాదు. పని చేసినందుకు కనీసం కూలి, బకాయి బిల్లులు ఇవ్వాలి. న్యాయంగా మాకు రావాల్సినవి ఇస్తే ఎంత మందికైనా వండిపెడతాం.

– అందె చంద్రకళ, కార్మికురాలు, తంగళ్లపల్లి హైస్కూల్‌

కాగా కార్మికులకు మార్చి బిల్లుల చెల్లింపులు జరిగినట్లు అధికారుల వివరణ.

డిమాండ్లు

కార్మికులకు గౌరవవేతనం రూ.3 వేలు ఇవ్వాలి. ప్రతి నెల 5 లోగా బిల్లులు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలి. పక్క రాష్ట్రాల్లో అమలు చేస్తున్న మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. గ్యాస్‌ సిలిండర్‌, కోడిగుడ్ల ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలి.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్‌

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఆపద సమయంలో ప్రతి బీఆర్‌ఎస్‌ కార్యకర్తకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని రాగట్లపల్లి మాజీ సర్పంచ్‌ మందాటి రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, మంత్రి కేటీఆర్‌ ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి డబుల్‌బెడ్‌ రూం ఇల్లు, రాజు భార్యకు ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా మంగళవారం డబుల్‌ బెడ్‌ రూం ఇల్లు మంజూరు పత్రాలు, స్థానిక డే కేర్‌ కేంద్రంలో రాజు భార్య రమ్యకు ఉద్యోగ పత్రాలను ఆగయ్య అందజేశారు. ఎంపీపీ పిల్లి రేణుక, మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, నాయకులు కృష్ణారెడ్డి, అందే సుభాష్‌, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, మహేందర్‌, బాల్‌రెడ్డి, రాము, సురేష్‌, శ్రీనివాస్‌, కిషన్‌, ఉదయ్‌, తహసీల్దార్‌ జయంత్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



రాజు భార్యకు డబుల్‌బెడ్‌ రూం, ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న ఆగయ్య

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): పార్టీ పటిష్టతకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన బూత్‌ కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో పార్టీని గెలిపించడానికి కార్యకర్తలు, నాయకులు ఇప్పటి నుంచి సన్నద్ధులు కావాలని, సైనికుల్లా పనిచేయాలని కోరారు. మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్‌, ప్రధాన కార్యదర్శి గంద్యాడపు రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్‌ దయాకర్‌రావు, సీనియర్‌ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌ వైఎస్సార్‌ చొరవే

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్‌

సిరిసిల్లటౌన్‌: రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్‌ అనేది దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌ చొరవేనని కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ అన్నారు. టీడీపీ హయాంలో వైఎస్సార్‌ ఉచిత విద్యుత్‌పై పోరాటం చేస్తుంటే అప్పటి సీఎం చంద్రబాబుతో కలిసి ఇప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్‌ వ్యతిరేకించారని విమర్శించారు. మంగళవారం సిరిసిల్లలో విలేకరులతో మాట్లాడారు. అమెరికాలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బీఆర్‌ఎస్‌ వక్రీకరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను తప్పుదోవ పట్టించేలా మంత్రి కేటీఆర్‌ వ్యాఖ్యలు సరికావని, ఇటువంటి అసంబద్ధ కామెంట్స్‌ బీఆర్‌ఎస్‌కు ఏమాత్రం సరికాదని సూచించారు. రైతులకు ఉచిత విద్యుత్‌పై తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కేటీఆర్‌ తప్పుడు వ్యాఖ్యలను ప్రజలు నమ్మబోరన్నారు. రుణమాఫీలు, ఉచిత ఎరువులు అని నమ్మించిన కేసీఆర్‌ అధికారంలోకి రాగానే కర్షకులను వంచించారని విమర్శించారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూసి బీఆర్‌ఎస్‌కు చెమటలు పడుతున్నాయన్నారు. ఈక్రమంలోనే రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ ఉనికిని కాపాడే ప్రయత్నాలు బీఆర్‌ఎస్‌ చేస్తుందని వారి మాటలను ప్రజలు ఎలాగూ విశ్వసించరన్నారు. ప్రజల పక్షాన నిలిచే కాంగ్రెస్‌పై బురద జల్లే ప్రయత్నం మానుకోవాలని అధికార పార్టీకి హితవు పలికారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలి

- కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి
- స్వచ్ఛ సర్వేక్షణ్‌పై జిల్లా అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్‌ అనురాగ్‌జయంతి

సిరిసిల్ల: గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌-2023పై జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ పబ్లిక్‌ ప్రదేశాలను శుభ్రంగా ఉంచాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌-2023లో జిల్లా జాతీయస్థాయిలో మొదటి స్థానం సాధించే దిశగా క్షేత్రస్థాయిలో పల్లెలను తీర్చిదిద్దాలని సూచించారు. కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్‌ బృందం ఈనెల 15లోగా జిల్లాలో పర్యటిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర బృందం అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేలా స్వయం సహాయక బృందాలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కరపత్రాలు ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. ఊరి చివరగా ఉండే మురికి కాల్వ ముగింపు ప్రదేశంలో విధిగా ఇంకుడు గుంతలను నిర్మించాలని పేర్కొన్నారు. మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసే ప్లాస్టిక్‌ వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌ యూనిట్‌ ఆపరేషన్‌ జరిగేలా చూడాలని ఎంపీడీవోలను ఆదేశించారు. అదనపు కలెక్టర్‌ బి.సత్యప్రసాద్‌, జెడ్పీ సీఈవో, డీఆర్‌డీవో బి.గౌతమ్‌రెడ్డి, డీపీవో ఎ.రవీందర్‌, వేములవాడ మున్సిపల్‌ కమిషనర్‌ అన్వేష్‌ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ బిల్లులు చెల్లించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్‌: నెలల తరబడిగా పెండింగ్‌లో ఉంటున్న తమ బిల్లులను వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు వారి సమస్యలపై మంగళవారం సిరిసిల్ల కలెక్టరేట్‌ ముందు ధర్నా చేపట్టగా వక్తలు మాట్లాడారు. వంట కార్మికులకు ప్రతినెల 5లోపు బిల్లులు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కోడిగుడ్లు, గ్యాస్‌, ఇతర నిత్యావసరాల చార్జీలు పెంచాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వమే నిత్యావసరాల వస్తువులు సరఫరా చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని తదితర సమస్యలను వివరిస్తూ కలెక్టర్‌ ఆఫీసులో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా కన్వీనర్‌ మీస లక్ష్మణ్‌, కదారి రాములు, మంత్రి చంద్రయ్య గుడిగొట్టు లక్ష్మి, సావిత్రి, జుబేదా తదితరులు పాల్గొన్నారు.

కురుమ కులస్తుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కురుమ కులస్తులు

వేములవాడరూరల్‌: కురుమ కులస్తుల కుల దేవత అయిన బీరప్ప ఆలయం వద్ద మర్రిచెట్టు కొమ్మలను ఉద్దేశపూర్వకంగా తొలగించారని నిరసన వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. వేములవాడ మండలం బొల్లారం గ్రామంలో కురుమ కులస్తులకు చెందిన బీరప్ప ఆలయం వద్ద మర్రిచెట్టు ఉంది. రైతుల పొలాలకు విద్యుత్‌ లైన్‌ తీసుకెళ్లే క్రమంలో చెట్టు కొమ్మలు అడ్డువస్తున్నాయని సెస్‌ సిబ్బంది మంగళవారం ఉదయం తొలగించారు. విషయం తెలుసుకున్న కురుమ కులస్తులు బీరప్పస్వామి ఆ కొమ్మలపై ఉంటాడని, తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కొంత మంది కావాలని ఇలా నరికివేయడం సరికాదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అదే చెట్టు వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వేములవాడ రూరల్‌ సీఐ బన్సీలాల్‌కు వివరించి, బాధ్యులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. దీనిపై విచారణ చేపడతామని సీఐ హామీ ఇవ్వడంతో తిరిగి వెళ్లారు.

ప్రాణభిక్ష పెట్టండి

- రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలో తండ్రి
- వైద్యఖర్చుల కోసం ఆపన్నహస్తం అందించాలని కొడుకుల వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకర్‌

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో గాయపడి, కోమాలోకి వెళ్లిన తండ్రిని రక్షించుకోవడానికి ఆ కొడుకులు తపనపడుతున్నారు. ఆర్థిక పరిస్థితులు అంతంతే కావడంతో ఖరీదైన వైద్యం కోసం ఆపన్నహస్తం అందించాలని దాతలను వేడుకుంటున్నారు. తమ తండ్రికి ప్రాణభిక్ష పెట్టాలని కోరుతున్నారు. వివరాలు.. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన పెంజర్ల శంకర్‌ వారం క్రితం రాచర్లగొల్లపల్లి నుంచి కిష్టంపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అకస్మాత్తుగా గేదె అడ్డు రావడంతో ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. వారం రోజుల్లో రూ.2లక్షల వరకు అప్పు చేసి వైద్యం అందించారు. కోమాలోకి వెళ్లిన శంకర్‌ కోలుకోవడానికి ఇంకా ఎంత వరకు ఖర్చు అవుతుందనే విషయాన్ని వైద్యులు చెప్పలేకపోతున్నారు. ఆస్పత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న తమ తండ్రి ప్రాణాలు నిలిపేందుకు దాతలు స్పందించాలని కుమారులు పెంజర్ల రామకృష్ణ, రాకేశ్‌, భార్య పద్మ వేడుకుంటున్నారు.

దాతలు సాయం చేయాల్సిన నంబర్‌ : రామకృష్ణ , ఫోన్‌పే నం. 99516 42135

చిన్నపాటి నిర్లక్ష్యం.. రూ.2.47 లక్షలు మాయం


- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు
- ఛేదించిన పోలీసులు.. డబ్బు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కిరణ్‌కుమార్‌

కోనరావుపేట(వేములవాడ): చిన్నపాటి నిర్లక్ష్యంతో బ్యాంకు ఖాతాలోని రూ.2.47 లక్షలు మాయమయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో విచారణ జరిపిన పోలీసులు కేసును ఛేదించి డబ్బు రికవరీ చేశారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్‌ మంగళవారం వివరాలు వెల్లడించారు. కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన కొమ్ము ప్రశాంత్‌ బతుకుదెరువు కోసం మస్కట్‌ వెళ్లాడు. అక్కడి నుంచి కోనరావుపేటలోని తన బ్యాంకు ఖాతాకు డబ్బులు పంపిస్తే తండ్రి పోచయ్య ఏటీఎం కార్డు ద్వారా డ్రా చేసుకుని వాడుకునేవారు. ఈక్రమంలో పోచయ్య ఇంటి వద్ద ప్రహరీ నిర్మాణానికి నిశ్చయించగా, ప్రశాంత్‌ తన ఖాతాలోని రూ.2.47 లక్షలు వాడుకోవాలని సూచించాడు. నెల క్రితం బ్యాంకు ఏటీఎంకు వెళ్లి చూడగా డబ్బు లేవని చూపెట్టింది. ఖాతాలో గుర్తుతెలియని వ్యక్తులు డబ్బు డ్రా చేశారని తెలుసుకున్న పోచయ్య కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా ఏపీలోని పార్వతీపురం జిల్లా ఉద్దవోలు గ్రామానికి చెందిన కర్రి నవీన్‌కుమార్‌ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్‌ జాబ్‌ చేస్తున్నాడు. నవీన్‌ ఫిబ్రవరిలో జియో సిమ్‌ (93461 91678) తీసుకున్నాడు. ఏప్రిల్‌లో రూ.లక్ష జమ అయినట్లు ఫోన్‌కు మెస్సేజ్‌ వెళ్లింది. నవీన్‌ తన ఖాతాలో చెక్‌ చేసుకోగా డబ్బులు జమకాలేదు. తర్వాత రూ.వెయ్యి ఇంట్రస్ట్‌ జమ అయినట్లు వచ్చింది. రెండోసారి కూడా డబ్బు జమకాకపోయేసరికి జియో సెంటర్‌ ద్వారా పేటీఎం అకౌంట్‌ క్రియేట్‌ చేసుకుని చూడగా ప్రశాంత్‌ బ్యాంక్‌ అకౌంట్‌కు లింక్‌ అయినట్లు, అందులో రూ.2.47 లక్షలు ఉన్నట్లు తెలుసుకున్నాడు. దీంతో జియో సెంటర్‌ ద్వారా పేటీఎం నుంచి పలు దఫాలుగా రూ.2.47 లక్షలు డ్రా చేసుకున్నాడు. కాగా 93461 91678 సెల్‌ నంబర్‌ను ప్రశాంత్‌ మస్కట్‌కు వెళ్లకముందు వాడి ఆ తర్వాత వాడలేదు. ఈక్రమంలో నంబర్‌ను జియో కంపెనీ నవీన్‌కు కేటాయించింది. నవీన్‌ డ్రా చేసుకున్న డబ్బుతో జల్సాలు చేస్తూ హైదరాబాద్‌ వెళ్తుండగా వరంగల్‌ వద్ద పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ కిరణ్‌కుమార్‌, ఎస్సై రమాకాంత్‌ వివరాలు వెల్లడించారు. ఎవరైనా తమ మొబైల్‌ను వాడకుంటే దానికి లింక్‌ అయి ఉన్న బ్యాంక్‌ అకౌంట్‌, డిజిటల్‌ పేమెంట్లలో డీయాక్టివేట్‌ చేయాలని కోరారు. ఈ సందర్భంగా కేసును ఛేదించిన సీఐ, ఎస్సై రమాకాంత్‌, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుల్‌ దండి నరేశ్‌ ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి అభినందించారు.

అంతర్‌జిల్లా దొంగ అరెస్ట్‌



దొంగను అరెస్టు చూపుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ముస్తాబాద్‌(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో చోరీకి యత్నించిన దొంగ పోలీసులకు చిక్కాడు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన మహ్మద్‌ రఫీక్‌ ముస్తాబాద్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈనెల 9న దుబ్బాక దారిలో తాళం వేసి ఉన్న మందాడి మల్లయ్య ఇంట్లో చొరబడేందుకు రఫీక్‌ యత్నించాడు. అదే సమయంలో పొలం పనులు ముగించుకుని మల్లయ్య, అతడి కుటుంబీకులు ఇంటికి చేరుకోగా గమనించిన రఫీక్‌ పారిపోయాడు. ఎస్సై వెంకటేశ్వర్లుకు మల్లయ్య అదే రోజు ఫిర్యాదు చేశాడు. ఆధారాలు, వేలిముద్రలు సేకరించిన పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టారు. రఫీక్‌ కదలికలపై నిఘాపెట్టి చాకచక్యంగా ముస్తాబాద్‌లో పట్టుకున్నారు. అతడిని విచారించగా సిద్దిపేట, నారాయణఖేడ్‌, దుబ్బాక తదితర ప్రాంతాల్లో అనేక దొంగతనం కేసులు నమోదు అయ్యాయని ఎస్సై తెలిపారు. వెల్డింగ్‌ పనులు చేసుకునే రఫీక్‌ జల్సాలకు అలవాటు పడి దొంగగా మారాడని పేర్కొన్నారు. ఈసందర్భంగా చోరీయత్నం జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే దొంగను పట్టుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్‌, శ్రీనివాస్‌ను సీఐ ఉపేందర్‌ అభినందించారు.

రోగులకు ప్రేమతో వైద్యం చేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్‌ అరుణ



ఆస్పత్రిలో పనులు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌

సిరిసిల్లటౌన్‌: జిల్లాసుపత్రికి వచ్చే రోగులతో సిబ్బంది, డాక్టర్లు ప్రేమతో మాట్లాడుతూ వైద్యం అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్‌ న్యాలకొండ అరుణ సూచించారు. మంగళవారం ఆమె అధ్యక్షతన జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. మంత్రి కేటీఆర్‌ చొరవతో ఆస్పత్రిలో సకల వసతులతో కార్పొరేట్‌కు దీటుగా పేదలకు ఉచిత వైద్యం అందుతుందన్నారు. ఈ స్ఫూర్తి ఎప్పటికీ కొనసాగించాలని ఆదేశించారు. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటూ, సీజనల్‌ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రసవాల విషయంలో ఆస్పత్రికి లక్ష్య అవార్డు రావడం గర్వకారణంగా పేర్కొన్నారు. అనంతరం ఆస్పత్రిలోని పై అంతస్తులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ మురళీధర్‌రావు, మెడికల్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ చంద్రశేఖర్‌, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, ఆర్‌ఎంవో నాగరాజు తదితరులున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో డెంగీ నివారణ

సిరిసిల్లటౌన్‌: ప్రజల భాగస్వామ్యంతో డెంగీ ప్రబలకుండా నివారణ సాధ్యపడుతుందని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్‌ శ్రీరాములు అన్నారు. 'డెంగీ నివారణ మహోత్సవం'లో భాగంగా మంగళవారం కార్యాలయంలో జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల మెడికల్‌ ఆఫీసర్లకు జరిగిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. భాగస్వామ్య పద్ధతులను ఉపయోగించడం ద్వారా డెంగీని నివారించవచ్చన్నారు. ప్రజలు ఇండ్లతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రతి మంగళ, శుక్రవారాలు డ్రై డే పాటించాలన్నారు. డెంగీ లక్షణాలు, నివారణ పద్ధతులను వివరించారు.

తండాల్లో శీత్లా పండుగ



ఎల్లారెడ్డిపేట: నైవేద్యాలతో ఊరేగింపు



రుద్రంగి: నైవేద్యాలతో వెళ్తున్న గిరిజన యువతులు



వీర్నపల్లి: మొక్కులు చెల్లించుకుంటున్న గిరిజనులు



ఎల్లారెడ్డిపేట: మహిళల సంప్రదాయ నృత్యం

ఎల్లారెడ్డిపేట/రుద్రంగి/గంభీరావుపేట/ముస్తాబాద్‌/వీర్నపల్లి: ఆడవి బిడ్డల పండుగ శీత్లాభవాని వేడుకలు మంగళవారం తండాల్లో అంగరంగవైభవంగా నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని 25 తండాల్లో గిరిజనులు వేడుకలు జరుపుకున్నారు. తండాల పొలిమేర్లలో శీత్లాభవాని అమ్మవారికి ప్రతిష్ఠించి యువతులు బోనాలు, నైవేద్యాలు, కోళ్లు, మేకలు, గొర్రెలతో అక్కడికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా గిరిజన మహిళల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.